మంచి కవితతో కొంచెం సేపు

విన్నకోట రవిశంకర్



# వలసపోయిన మందహాసం

## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

ఆగష్టు మాసంలో అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని కాలేజీలకి పంపిఉంటారు. వారు లేని లోటుకి నెమ్మదిగా అలవాటుపడుతూఉంటారు. అలా అడుగు బయటపెట్టిన పిల్లలు, ఆ తరువాత తమ తమ జీవితాలను వెదుక్కొంటూ ఎటో వెళ్ళిపోతారు. తమ సంతతి తమలాగే ఎదిగి స్వతంత్రులు కాగా చూడటమన్నది జీవరాసికున్న ఒక విశిష్టమైన అనుభవం. పశుపక్ష్యాదులకైతే, సంతతి స్వతంత్రం కావటంతోటే వాటిపై మమకారం తీరిపోతుంది. కాని, మనుషులకుమాత్రం, ఎంతకాలమైనా, పిల్లలపై మమకారం అలాగే ఉంటుంది. అందుకే, పెరిగి పెద్దైనాకకూడా, పిల్లల చెయ్యి విడవాలన్నా, ఆడపిల్లలైతే మరొకరి చేతిలో పెట్టాలన్నా బాధగా ఉంటుంది. ఇది సార్వజనీనమైన, సర్వకాలికమైన అనుభవం. ఎప్పటికీ పాతబడదు. ఇటువంటి అనుభవాన్ని స్పృశించినందువల్లే, కొంచెం పాతదైనా ఈ సందర్భంలో నాకు ముకుందరామారావుగారి "వలసపోయిన మందహాసం" కవిత గుర్తుకు వచ్చింది.

ఈ కవిత ఇదే పేరుతో వెలువడిన ఆయన మొదటి సంకలనంలో ఉంటుంది.

ఈ కవిత, పెళ్ళిచేసుకుని అత్తవారింటికి వెళ్ళిన కూతురు గురించి రాసినది. సాంప్రదాయ కవిత్వంలో ఈ సన్నివేశంలో హితోక్తులు, ధైర్యవచనాలు చెప్పటనికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ, ఈ కవితలో వాటి జోలికి పోకుండా, మిగిలిపోయినవారి మనోభావాలు చెప్పటానికే ప్రాధాన్యత ఇవ్వబడింది. ఐతే, బెంగ కలిగినా, సందర్భం ఆనందకరమే కాబట్టి, ఇక్కడ ఆమె వెళ్ళటం గురించి చెప్పిన పదచిత్రాలన్నీ మృదువుగా,సున్నితంగా ఉంటాయి –

"సుందర చైతన్యాకృతి వీడ్కోలిస్తున్నప్పుడు", "గువ్వలా ఎగిరిపోయినట్టుంది", "సైబీరియన్ పక్షిలా వలసపోయింది" వంటివి.

కవితలో మిగతా భాగమంతా ఆమె లేని వెలితిని వ్యక్తంచెయ్యటానికే ఉపయోగించబడింది. ఆమె ఎదగటం, పెండ్లి చేసుకుని, బయటకు వెళ్ళే వయస్సుకి రావటం ఒక పరిణామమైతే, అమె నిజంగా వీడ్కోలిచ్చి వెళ్ళిపోవటం ఒక సంఘటన. "ఎగిరిపోయిన ఛాయలెక్కడా లేవు. కనిపించక కలవరం తప్ప" అనటం ఆ సంఘటనకు అలవాటు పడటం ఎంతకష్టమో తెలియజేస్తుంది. వెనువెంటనే, పువ్వుల గురించి, పండ్ల గురించి, మొక్కల గురించి ప్రస్తావించటంవల్ల దానినొక అనివార్యమైన సహజ పరిణామంగా సర్ది చెప్పుకోవటం కనిపిస్తుంది. నిజానికి, పువ్వులు,పండ్లు, మొక్కలను జీవితం కొనసాగింపుకు సంబంధించిన అనివార్యతను సూచించటానికి ప్రతీకగా రామారావుగారు అనేక ఇతర కవితల్లో కూడా వాడారు.

కవిత చివరి వాక్యాల్లో మాత్రం ఆమె భవిష్యత్తు గురించిన ప్రస్తావన ఉంటుంది. ఈ రకమైన ఆందోళన పెళ్ళిచేసి పంపుతున్న తల్లిదండ్రులకు సహజంగా కలిగేదే. తనకు జన్మించిన ఒక సుందర చైతన్యాకృతితో మొదలుపెట్టిన కవితను, అమె చేరుకున్న వాడి మందహాసంతో ముగించటం వల్ల , కవితకు పరిపూర్ణత ఏర్పడింది.

కవితకు పెట్టిన శీర్షికకి, ముగింపు వాక్యాలకి కూడా సామరస్యం బాగా కుదిరింది. ఐతే, కవితలో చివరి పాదాలు మినహాయిస్తే, మిగతా భాగమంతా, సామాన్యమైన ప్రతీకలే వాడటం వలన, పెళ్ళిచేసుకుని వెళ్ళటమే కాకుండా ఇతర సందర్భాలకి అన్వయించుకున్నా అంత ఇబ్బంది ఉండదు.

ఈ సందర్భంలో నాకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన "గూడు మారిన కొత్తరికం" కథ గుర్తుకు వస్తుంది. అందులో కొత్తగా పెళ్ళై వెళ్ళిన కూతుర్ని వదిలి ఉండలేని తల్లిదండ్రుల మనోభావాల్ని చాలా హృద్యంగా చెబుతారు. వాళ్ళు చివరికి ఉండ బట్టలేక, కూతురి ఇంటికి ప్రయాణం కూడా కడతారు. ఆడపిల్లలున్న తల్లిదండ్రులు తప్పక చదవవలసిన కథ అది.

సార్వకాలికమైన ఒక అనుభవాన్ని, కుప్తంగా, మనసుకు హత్తుకునేలా చెప్పిన ఈ కవిత తప్పక గుర్తుంచుకోదగినది.

కవిత పూర్తి పాఠం:

నాకు మొలకెత్తిన ఓ సుందరచైతన్యాకృతి
నాకే వీడ్కోలిస్తున్నప్పుడు
ఇన్నాళ్ళూ
గుండె గదిలో వొదిగి వొదిగి
కళ్ళకేదో మంచుతెరకప్పి
చూస్తూ చూస్తూనే
గువ్వలా ఎగిరిపోయినట్టుంది.
తెలిసి తెలిసి
సైబీరియన్ పక్షిలా వలసపోయినట్టుంది.
సందడిని, సంబరాన్ని మూటకట్టుకు పోయిందేమో!
ఇంతలోనే మేము మనుషుల మధ్యే లేనట్టుంది
అనుభవానికొస్తేగాని
ఏ వేదనైనా ఆవేదనైనా అర్థం కాకుండా ఉంది.

చెంగు చెంగున గెంతులు
చిన్నప్పటి గుజ్జెన గూళ్ళు
చిలిపి చేష్టలు
ఇల్లంతా నింపిన అలంకరణలై
ఇంటందరికీ గుర్తు చేస్తూనే ఉంది.
ఎగిరిపోయిన ఛాయలెక్కడా లేవు
కనిపించక కలవరం తప్పు
లేకుండా ఉండలేని నిర్లిప్తత తప్పు

నువ్వైనా నేనైనా
మొలకెత్తిన చోటే మొక్కలన్నింటినీ ఉండనీయం
పూచిన పూలనీ పండ్లనీ చెట్టుకే వదిలేయం
ఎంతలేదన్నా కాదన్నా
విడిచిపోలేని బాధ
విడదీస్తున్న చేతులకంటదు
లేదంటే చూడు
పోగొట్టుకున్న వాడిముందు గెల్చుకున్నవాడి గర్వంలా
ఆ చేతిలో చెయ్యి
అభయహస్తమవునోకాదో
మందహాసమై మెరుస్తోంది
సరిగ్గా ఒకప్పటి నాలాగే!

- ముకుంద రామారావు

******

